ఎక్సురే ౩౦

# ధర్మ సూక్ష్మం

"విహారి"

రామానుజంగారి పేరుకి వెనకగాని ముందుగాని యేమాత్రం బలంలేదు. అంటే, ముందువేపు రావు, దివాన్ యిత్యాదివిగాని, వెనకప్రక్క బహదూరుడు, క, ఖ, గ, ఘ యిత్యాదులుగాని నామమాత్రానికైనా లేవు. అయితే నేం, పేర్లకి ముందువెనకల బలమైన ఆధారాలు గలవారు సైతం చచ్చి పిడికెడు దుమ్మయినా సంపాయించలేని గౌరవం అధికారం, రాజసం కొల్లగా జమచేసి పారేశారు రామానుజంగారు. ఆ చుట్టుపక్కల పద-పదహారు, గ్రామాల్లోకూడా అలాంటి ధర్మపరుడు లేడనే మాట నిర్వివాదాంశం. వీరు ఒక యజ్ఞం చేయించారు; వూళ్లో భిక్షగాండ్లు శాశ్వతంగా వుండగలందులకు వోహ చావడి కట్టించారు; గ్రామాన్ని అహర్నిశలూ వెయ్యికళ్ళతో కాపాడుతుండే నూకాలమ్మ తల్లికి బండల భవనం నిర్మింపజేశాడు. అడిగినంతమాత్రాన్నే వో బోధకుడికి గుడి కట్టించి యిచ్చారు. మరోడికి వో అరుగూ గట్రా వో చెట్టుకింద జిరాయితీగా కట్టించి సమర్పించుకున్నారు. వారి ధర్మబుద్ధికీ, సర్వసమత్వానికీ యింతకంటే వుదాహరణం యింకేం కావాలి? యిది యిలా వుండగా, ఆ ప్రాంతంలో కలుగుతుండే ధర్మసందేహాలకి వీరే మనువు:- తగాదాలు వగైరాలకు మధ్యవర్తీ, సమవర్తికూడా!

సాధారణంగా జనులు వో మనిషియొక్క సంపన్నతను, అంటే ధనసమృద్ధిని చూచే, "దాసోహం" అంటారు. అలాంటప్పుడు వో చిట్టి జాగీరుతోప్పాటు యిన్ని గుణగణాలతో విరాజిల్లెడు రామానుజంగార్ని యెవరు దరిజేర సాహసిస్తారు?

రామానుజంగారి తల్లి ముసలి గువ్వ. మహా ధర్మపరురాలు, కళ్ళు కానవొస్తుండే వరకూ, ముఖ్యంగా యెవరైనా యింటికి వొచ్చినప్పుడూ, యే రామాయణమో, యే భాగవతమో లేక మరి యే మతగ్రంథమో చేతినుంచి వొదిలేవేకాదు. అక్షరజ్ఞానం వుండి చదువుతున్నదా, లేదా అని విచారించవలసిన అవసరం యేవరి కేం? యింత ధర్మపరురాలు కాబట్టే, కోడలు యింట్లో అడుగుపెట్టింది మొదలు, సర్వవిధాలా ఆమెను కర్తెర బోనులో క్రమ శిక్ష యిచ్చి, తన అత్తత్వాన్ని నూటికి నూరువంతులూ సార్ధకం చేసుకొని, మరీ వొదిలింది. తర్వాత తర్వాత నేత్రావరోధంవల్లనూ, అంతకంతకూ ముదిమి ముంచుకొని రావడంవల్లనూ, సర్వాంగాలతోనూ ధర్మనిర్వహణానికి ఆటంకం వొచ్చి పడడంవల్ల, కూచున్నచోటినుంచే అంగప్రత్యంగాలనూ వాక్కులో కేంద్రీకరించి, యధాశక్తి పాటుపడ ప్రారంభించింది. అలాంటి మాతృదేవత అవసాన కాలంలో తన తుదికోరిగ్గా వెలువరించడంవల్ల, రామానుజంగారు తన బిడ్డ తాయారుకు ఆరోయేటనే పెళ్లిచేశారు. యెనిమిదేళ్ళు పూర్తిగా నిండి, పూర్తి కన్య అయ్యేవరకూ చెయ్యడం తనకు యిష్టంలేకున్నా, "మాతృదేవోభవ"ను పూర్తిగా పునశ్చరణచేసేవారు కాబట్టి, ఆమె తుది కోరికను యిలా తీర్చాలసి వొచ్చింది. అది కాస్తా విని, ఆ మాతృదేవత మరో లోకానికి ప్రయాణం కట్టింది, యిలా పునాది వేసి.

కర్మానుభవం యెవరికైనా తప్పదు. కాని బయటి దృష్టిలో వొక్కోసారి వొకరు చేసిన కర్మను మరొకరు అనుభవిస్తూవుండడం ప్రాయికంగా కనబడుతుంటుంది. తాయారుకు యెనిమిదేళ్ళు నిండాయో లేదో కర్మానుభవం తయారైంది. రామానుజంగారి అల్లుడు పురాణజ్వరంవల్ల యెన్ని యింజక్షన్లు యిచ్చినా వినక పరమపదించాడు. దీనికి యెవరేం చేస్తారు?

అమ్మాయికి పధ్నాలు గేళ్లు రాగానే, విధివిధానంగా కావలసిన కార్యాన్ని నెరవేర్పించారు రామానుజంగారు. యిలాంటి విషయాల్లో వొకరికి తీర్పు చెప్పే తన్లాంటి మనిషి అన్యధా వర్తిస్తే, లోకం యామంటుంది? కాని "తలలు బోడులైన తలపులు బోడులా"? అందులో పిడికెడన్నం పిడికెడు నెయ్యీ తిని బాగా చియ్యబట్టిన శరీరం; దానిమీద నేచరు బాగా పనిచేసింది; కళ్లానికి కట్టిన పగ్గాలు దుర్బలమైనవి కావడంగూడా వొచ్చి పడడంవల్ల, అవి కాస్తా తెగి కూచున్నాయి. యిందులో తప్పనేది వొకటుంటే దాన్ని యెవరి నెత్తికి అంటగట్టాలి?

లోపలి స్వయంపాకం జరిగినన్నాళ్ళూ జరిగింది. చివరకి బట్టబయలైంది పరమ రహస్యం. ధర్మాసనంమీదవున్న ధర్మదేవత రామానుజంగారి కర్తవ్యం యేమిటి?

లోకమూ రెప్పవాల్చకుండా చూడసాగింది. దయా, కర్తవ్యమూ, స్వార్థమూ వో వైపూ; పాతప్రతిష్ఠా, ఆచారమూ, మరో వైపూ మోహరించి సంకుల సమరం ప్రారంభించాయి. ఆచార ప్రతిష్టల చెయ్యే పైచెయ్యి పోయింది. చివరకి యెదటికివొచ్చి "యిదేమి?" అనేవాడులేకున్నా, రామానుజంగారు తా నల్లుకున్న తన గూట్లోనే తాను

చిక్కుపడి, అసహాయుడై పోయ్యాడు. తాయారుని ఆత్మీయుల దృష్టిపథంనుంచీ, తన దృష్టిపథంనుంచీ దూరం చెయ్యడంతో శాంతిభద్రతలు చేకూరాయి. తాయారు జాడ నాటికీ నేటికీ లోకానికీ మనకూ తెలీదు. అప్పుడప్పుడూ పదీ, అయిదూ పంపుతుండే ఆ కన్నతండ్రికితప్ప. అవీగూడా యెలా వెళుతాయో, రసీదు యెలా వొస్తుందో ఆవూరి పోష్టు చిత్రగుప్తుడిగ్గూడా తెలీదు. యింక యీ శాశ్వతశిక్షవల్ల తాయారు బాగుపడ్డదా లేదా కనుక్కోవాలంటే, మనం జాడాలమీద వెళ్ళిరావడం తప్ప, మరో గత్యంతరం లేదు. దాన్నిగురించి యిక్కడ్డే చర్చించామంటే, అదో పెద్ద అపరాధంకింద పరిణమించవొచ్చు కాబట్టి విరమిద్దాం.

తాయారు పెళ్ళి సంవత్సరమే ఆమెకంటె పెద్దవాడైన వాసుకుగూడా, పెళ్ళయింది. అతడు రామానుజంగారి యేకైక పుత్రుడు. 'ఖా రు బో రు' మంటూ పెళ్ళిచేశారు. అన్నివిధాలా మంచి సంబంధమే కుదిరిందని మెచ్చుకున్నారు ఆహూతులు. కాని అదేమికర్మమో నూతనవధువు యీడేరి యింటికిరావడమే ఆలస్యం, వాసు మంచమ్మెక్కాడు. పక్షవాతమని వైద్యులు నిర్ణయించి, నానావిధాలుగా సూదిమందులతో సహా! ఔషధాలు నడిపారు. కానిలాభంసున్నా. చేతులూ కాళ్ళూ పడిపొయ్యాయి. ఆధారం లేకుండా కూచోడంగూడా అసాధ్యమైపోయింది. గాక బాకీ తలా, దాన్ని ఆశ్రయించుకొనివుండే కన్నూ ముక్కూ వగేరా మాత్రం అతని స్వాధీనంలో మిగిలిపొయ్యాయి. సరిగా యీ సమయంలోనే తాయారు వెళ్ళిపోవడం. ధర్మపత్ని యెంత సహనంతో రాత్రనకా పగలనకా సేవచేస్తున్నా యీ షాకుగూడా మూలిగేనక్కమీద తాటికాయలా, వాసుకు తగలకపోలా! దీంతో అతని స్వాస్త్యం మరీ నీరసించింది, కాని ప్రాణాపాయం కాకుండా నిలిచినందుకు అందరూ సంతోషించారు.

తానింతవేసి ధర్మకార్యాలు చేస్తున్నా, కూతురి గతి అలా చూస్తూనైనా సంతోషించడానికి లేని విధంగా అయిపోవడం, వున్న వొక్క కొడుకూ యీగతిగా పడివుండడం, చివరకి యింత వంశం పేరిటవో నలుసైనా కలిగే అవకాశం కనబడకపోవడం తలుచుకున్నప్పుడు రామానుజం దంపతుల కడుపులు తరుక్కొనిపోసాగాయి. మొల్లోతు దుఃఖంలో మోకాటిలోతు సంతోషం లా, పరిస్థితులు యింతటి విషమ స్థితిలో వున్నా నిప్పులా వుండి, బూమెమ్మలా శాంతంతో సర్వవిధాలా సేవచేస్తూవున్న కోడల్ని చూచుకొని సంతోషపడసాగారు. యెక్కడ వినబోయినా ఆమె గుణగణగానమే ఆ వూళ్లో.

వున్నట్టుండి వాసుకి సంతానం కలిగే చిహ్నాలు అవపడసాగాయి. అంతస్సారం యెగరజాలని లోకులు పరిపరి విధాల గుజగుజ లాడసాగారు. కాని వొక్కడికైనా యెదటపడి, వో కూత కూయడానికి పిండశక్తి లేకపోయింది. మామగారి ధార్మికత్వానికి మెచ్చో, కోడలుగారి పాతివ్రత్యానికి ముగ్ధయ్యో, యే దేవుడో యిలా వంశం వుద్ధరించి వుంటాడని, సాధారణమైన జనం మాటకేం, అత్తమామలుగూడా నమ్మలాకపొయ్యారు మొదట్లో. కాని, రోజులు గడిచేకొద్దీ కేవలం యీ పాంచభౌతికమైన పద్ధతుల మూలంగానే, సక్రమ పద్ధతిలోనే, అబ్బాయి కొత్త లేస్తూ తిరుగుతూవుంటంవల్ల యీ అవకాశం లభించిందని నమ్మటం మొదలుపెట్టారు. ఆ లేవడం, తిరగడం బైటివాళ్ళకేం తెలుస్తుంది?

యింట్లో వీరు యిలా సరిపెట్టుకోగలిగారు గాని, లోకులు తమలో తాము కాకికూతగా కానిమాటలు అనుకోవడం మానలా! కలిలో వున్నత భావాలు యెలా తోస్తాయి అంతకంటే? పేరు ప్రఖ్యాతులుగల కొందరి పుట్టుకల్లో వుండే విలక్షణత యిలానే వుంటుందన్న సంగతి యెవరికీ తోచలా! ఈ థియరీని మహామహా సైన్సువేత్తలు సైతం వొప్పుకున్నారు. కాల కర్మ సంయోగం కలుగుతే దేనితోనూ పన్లేదు. కార్యాలు అవంతట అవే రొండో కంటికి తెలీకుండా అయిపోతాయి. కావాలంటే దీనికి లెక్కలేనన్ని వుదాహరణాలు వున్నాయి చొప్పకట్టల్లా పడి. పాతసంగతులంటే రోతపుట్టే ఈకాలంలో నమ్మకపోవడం సహజమే కావొచ్చుగాని, పాతవన్నీ నిజాలని వోపక్క రుజువైపోతుంటే, దీన్ని వొక్కదాన్ని కాదనటం, చాలా అధర్మంగా తోస్తుంది.

పుత్రోదయం అయింది, భూరిదానాలూ, భోజనాలూ జరిగాయి. చెవులు కొరుక్కునే దద్దమ్మలంతా చెప్పుకింది తేళ్ళలా వెళ్లి, చెడతినీ, వొచ్చారు. దినదినప్రవర్ధమానమౌతున్న అబ్బాయిని అందరూ యెగేసుకొని దిగేసుకొని నాకారు, గతాన్ని మరిచి. యెంతటి సాధుపుంగవత్వమో చూడండి.

బైది—బై, అసలు సంగతి మరిచా: అబ్బాయికి యవ్వనోదయంకూడా అయింది. తండ్రికి చూచి సంతోషించేయోగం లేకున్నా, తాతా, అవ్వా ఆనందసముద్రంలో మునకలు వేస్తున్నారు. యీమధ్య అబ్బాయికి కన్యనిచ్చి యేవిధంగానైతేనేం అయిదారువేలు ముట్టజెప్పుకుంటామని, వో రిటైర్డు సంపన్నుడు వచ్చివెళ్ళాడు. బోలెడంత పీకులాటమీద రామానుజం తాతగారు వొప్పుకున్నారు. శుభలేఖలు అచ్చొత్తింపింపబడి కూడా వొచ్చేశాయి. పనులు మహాచురుగ్గా జరుగుతున్నాయి. వివాహం మా జోరుగా జరగడంలో సందేహం వుండదు. కాని యిప్పుడయినా తాయారుకు శుభలేఖముట్టి, ప్రవాసం ముగించుకొని రావడానికి అవకాశం వుంటుందని తోచదు. దీనికి కర్తృత్వంకల ఆ దేవుడు, ఆ కర్తృత్వంకూడా తనమీద యెందుకు వేసుకోరాదూ—యీ శుభసమయంలోనైనా?